నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

నేరడిగొండ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నేరడిగొండ



మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా షేక్ ఫసియొద్దీన్, అధ్యక్షులుగా గాజుల దేవేందర్, ఉపాధ్యక్షులుగా ఎండీ అజహర్, ఏలేటి సృజన్‌రెడ్డి, కార్యదర్శిగా సీహెచ్ మధన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి జాదవ్ రామారావు, దస్తూరిగా సొన్న నవీన్, కోశాధికారిగా స్వామిగౌడ్, సలహాదారులుగా, గాజుల శ్రీకాంత్, నలిమెల పోతన్న, పొన్న సతీష్, ఆకుల అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన, పాత్రికేయ మిత్రులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యేకు అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తాంసి



బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో పాటు సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ రవికిరణ్ యాదవ్ నేరడిగొండలోని ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి పూలమాలలతో సన్మానించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, మండలాల నాయకులు నాగయ్య కృష్ణ, రమణ, రఘు, సంజీవరెడ్డి, రజనీకాంత్, కాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, సంతోష్, లింబాజి, భగవాన్లు, వినోద్‌రెడ్డి, అనిల్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

చినుకు రాలక..చింత తీరక..!

- మేఘాలు కమ్ముకుంటున్నా కురవని వర్షం
- వస్తాయనే నమ్మకంతో విత్తనాలు విత్తిన అన్నదాతలు
- వానలు ముఖం చాటేయడంతో ఆందోళనలో కర్షకులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదు

వర్షా కాలం ప్రారంభమైంది. ఎలాగో వర్షాలు వస్తాయనే నమ్మకంతో విత్తనాలు వేసిన రైతులకు ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రారంభంలో ఒకటి, రెండు వర్షాలు రావడంతో పొలాలకు పరుగులు తీసిన కర్షకులు విత్తనాలు విత్తారు. కానీ గత నాలుగు రోజులుగా వానలు జాడలేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రోజూ సాయంత్రం మేఘాలు కమ్ముకుంటున్నా..ఆకాశం ఉరుముతున్నా.. వర్షం మాత్రం కురవడం లేదు. వాతావరణశాఖ సైతం ఐదు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని చెప్పడం.. వాతావరణం సైతం అదే మాదిరి కనిపించడంతో రైతుల్లో నమ్మకం కలిగింది. కానీ వర్షం జాడ లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. మరో ఒకటి, రెండు రోజుల్లో వర్షం రాకపోతే భూమిలో వేసిన విత్తనాలన్ని మురిగిపోయి మొలకెత్తకుండా పనికిరాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో లోటు వర్షపాతం నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చినుకు జాడ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాధారం మీద ఆధారపడి పంటలు పండిస్తున్న రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. అనుకున్న సమయానికి ప్రకృతి సహకరించకపోవడంతో నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెప్పడంతో ఆనందం వ్యక్తం చేసిన అన్నదాతలకు ఆదిలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కాగానే ఒకటి, రెండు పెద్ద వానలు కురవడంతో ఇక వరుసగా వస్తాయనే నమ్మకంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 80శాతం మంది రైతులు పత్తి విత్తనాలు విత్తారు. కానీ వర్షం జాడ లేకపోవడంతో వేలాది రూపాయలతో కొనుగోలు చేసిన విత్తనాలు భూమిలోనే మురిగిపోయే ప్రమాదం కనిపిస్తోంది. విత్తనాలు విత్తి నాలుగు రోజులు గడుస్తున్నా వరుణుడు కరుణించకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాకాలం మొదట్లోనే విత్తనం వేసే త్వరగా కాపు కాస్తుందనే ఆశతో అనేక మంది చిన్న సన్నకారు రైతులతో పాటు అనేక మంది విత్తనాలు వేశారు. తీరా వర్షం జాడలేకపోవడం వారిని ఆవేదనకు గురిచేస్తోంది. ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సమాచారం సామాజిక మాధ్యమాల్లోనూ ప్రసారం కావడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు.

లోటు వర్షపాతం నమోదు..!

వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో లోటు వర్షపాతమే నమోదవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి ఈ నెల 16వ తేదీ వరకు కురవాల్సిన వర్షం కంటే అతి తక్కువగా నమోదవుతుండటంతో అన్నదాతలు కలవర పడుతున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 79మి.మి వర్షం కురవాల్సి ఉండగా..కేవలం 40.4మి.మి మాత్రమే కురిసింది. ఇంకా 49శాతం లోటు వర్షపాతం నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 69.9మి.మి వర్షం కురవాల్సి ఉండగా కేవలం 38.1మి.మి మాత్రమే కురిసింది. ఇంకా 45శాతం మైనస్‌లో ఉంది. మంచిర్యాల జిల్లాలో 68.8మి.మి కురవాల్సి ఉండగా 17.9మి.మి మాత్రమే కురిసింది. ఇంకా 74శాతం లోటు కనిపిస్తోంది. నిర్మల్ జిల్లాలో 79.6మి.మి వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 44.4మి.మి మాత్రమే కురిసింది. ఇంకా 44శాతం మైనస్‌లో ఉంది. ఇలా లోటు వర్షపాతం నమోదుకావడం.. ఇప్పటికే రైతులు పత్తి విత్తనాలు విత్తడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తొలిదశలో వేసిన విత్తనాలు మొలకెత్తుతాయా..లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

15ఎకరాల్లో విత్తనాలు వేశాను

కంది గోవర్ధన్‌రెడ్డి, తాంసి



వర్షాకాలం ప్రారంభం కాగానే మొదట్లో వర్షాలు కురవడంతో 15 ఎకరాల్లో 30 బ్యాగుల పత్తి విత్తనాలు వేశాను. కానీ వారం రోజులుగా వర్షాలు జాడలేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మరో ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు రాకపోతే పెట్టిన విత్తనాలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది.

విత్తనాలు విత్తేందుకు సమయం ఉంది

రాజశేఖర్, కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త



వర్షాకాలం ప్రారంభమైంది కదా అని రైతులు ఇప్పుడే విత్తనాలు విత్త కూడదు. కనీసం 60 నుంచి 70మి.మి వర్షం కురిసిన తర్వాతే విత్తుకోవాలి. పత్తి,సోయా విత్తనాలు జులై 10వరకు, కంది విత్తనాలు జులై 30వరకు విత్తేందుకు సమయం ఉంది. రైతులు తొందరపడకూడదు.

వారం రోజులుగా జాడలేదు

గంధం రాజన్న, బీబ్రా, బెజ్జూర్ మండలం



వర్షాలు వస్తాయనే నమ్మకంతో తొమ్మిది ఎకరాల్లో పత్తి విత్తనాలు పెట్టారు. విత్తనం విత్తిన నాటి నుంచి వారం రోజులుగా వర్షం జాడలేకుండా పోయింది. దీంతో విత్తనాలు మొలకెత్తుతాయో లేదోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

విజయోత్సవ అభినందన సభ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఎంపీ గోడం నగేష్ విజయోత్సవ అభినందన సభను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీ గోడం నగేష్‌ని ఆహ్వానించారు. గెలుపొందిన తర్వాత మొట్టమొదటిగా మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కుంటాల రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్‌తో పాటు రోడ్డుకు ఇరువైపుల బారికేడ్లను ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. మండల కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు సాబ్లే సంతోష్‌సింగ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీ ఇందూర్ గంగాధర్, పట్టణ అధ్యక్షులు తుమ్మాజీ భూమేష్‌చారి, మండల కార్యదర్శి బొంతుకుల శ్రీను, యువ మోర్చ మండల అధ్యక్షులు బాక్రే లక్ష్మణ్ ఉన్నారు.

వర్షాల కోసం కప్పతల్లి ఆటలు



నవతెలంగాణ-తాంసి

వర్షాలు సమృద్ధిగా కురువాలని ఆదివారం భీంపూర్ మండలంలోని కరంజి గ్రామంలో చిన్నారులు కప్పతల్లి ఆడారు. కప్పను కట్టెకు కట్టి వేప కొమ్మలు చేత పట్టుకొని, ఇంటింటికి వెళ్లి గ్రామస్తులు నీళ్లతో కప్పపై చిన్నారులపై నీళ్లు పోయడం సాంప్రదాయం. కప్పతల్లి ఆట ఆడితే వర్షాలు పడతాయని నమ్మకం గత పూర్వం నుంచి కొనసాగుతుందని పలువురు పేర్కొన్నారు. వర్షాలు పడి పంటలు పండాలని కోరుకున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీ కార్యకర్తల, అభిమానుల, నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యే తినిపించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవధను నిషేధించాలి

- బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-తలమడుగు

బక్రీద్ పండుగకు గోవధను అడ్డుకోవాలంటూ ఆదివారం మండల బీజేపీ నాయకులు ఏఎస్సై సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. బక్రీద్ పండుగ రోజున అనేక గోవధ జరుగుతున్నందున వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు గోవధను అడ్డుకోవాలంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన పిటిషన్ పరిశీలించి, బక్రీద్ పండుగకు గోవధగోవుల అక్రమ రవాణా జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు దాతజీ కిరణ్, పొట్టిపెల్లి శ్రీనివాస్, గొడం భుజంగ్‌రావు, గిరిజన మోర్చ కోరండ్ల పురుషోత్తం, చెలక గంగాధర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని శంకరపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజేశ్వర్ ఇటీవల మరణించడంతో ఆదివారం బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజురెడ్డి, శంకర్, కపిల్ పాల్గొన్నారు.



అధ్వానంగా రైతు వేదిక పరిసరాలు

- పెంట కుప్పల నడుమ భవనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



నవతెలంగాణ-తలమడుగు

గత ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి, రైతులకు వ్యవసాయ శాఖ తరపున సలహా సూచనలు సమావేశాల కొరకు అప్పటి ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించి ఇచ్చింది. ప్రస్తుతం రైతులకు సమావేశాలు, సలహాలు ఇస్తున్నప్పటికీ, నిర్వహణ లోపం కారణంగా రైతు వేదిక చుట్టుపక్కల పెంటకుప్పలు, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో పాటు చుట్టుపక్కల మల విసర్జన చేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది. కానీ సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు ఏం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని రుయ్యాడి రైతు వేదిక భవనం పరిసర ప్రాంతాల్లో పెంటకుప్పలతో పాటు చెత్తచెదారం దుర్గంధం వెదజల్లుతుంది. రైతు వేదిక భవనం ముందే పెంట కుప్పలు, చెత్తచెదారం ఉండటంతో అసలు రైతు వేదిక ఇలా ఉంటుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతినిత్యం అదే మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న రైతు వేదిక భవనం ముందు పెంట కుప్పలు కనబడటం లేదా అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వ భవనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉన్నప్పటికీ అవేం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. రైతులకు విత్తనాలు మందుల పట్ల అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు ఎలాంటి మందులు విత్తనాలు నాటాలి. దుకాణం బిల్లులు బ్యాచ్ నెంబర్లు భద్రంగా రైతులు ఉంచుకోవాలనే ఎరువుల పట్ల అవగాహన కల్పించాల్సిన అధికారులే పట్టించుకోవడం లేదంటూ, రైతులు గ్రామస్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు వేదిక భవనం చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి రైతులకు ఉపయోగపడే విధంగా భవనాన్ని ఉంచాలంటూ రైతుల కోరుతున్నారు.

అంగరంగ వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామంలో శ్రీ మహాలక్ష్మి ఆరవ ఆలయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు చేసి, వేద పండితుల మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ మహాలక్ష్మి దర్శనం చేసుకున్నారు. వర్షాలు సకాలంలో పడి పంటలు పండాలని, అందరు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కన్నాజి నర్సింగ్‌చారి, గణేష్, విఠల్, లక్ష్మీనారాయణ, నాయకులు లింగారెడ్డి, లక్ష్మీపతి, అశోక్, ఆనంద్, రమణ, సుభాష్, చంద్రన్న పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న దేవుని పండుగ



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం భీమన్న దేవుని పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సాంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ కుల పెద్దలు మాట్లాడుతూ ప్రతి యేటా వర్షాకాల ప్రారంభానికి ముందు భీమన్న దేవునికి పండుగలు నిర్వహించడం ఆనవాయితిగా వస్తోందని అన్నారు. భీమన్న దేవుడి ఆశీస్సులతో సకాలంలో ఆశించిన రీతిలో వర్షాలుపడి గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు మెండే నర్సయ్య, గాదెపెల్లి బాబు, ముత్యం, సంటెన్నోల్ల గంగాధర్, ఎర్రమల్లు గంగాధర్, పోతన్న, బోయిడి లక్ష్మణ్, రమేష్, నవీన్, అశోక్, సురేష్, రాములు, భోజన్న, సాయన్న పాల్గొన్నారు.

జన్మదినం సందర్భంగా అన్నదానం

నవతెలంగాణ-బోథ్

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదినం సందర్భంగా మండలంలోని సొనాల గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి ఆదివారం అన్నదానం చేశారు. లిటిల్ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- సాగు దారులపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలి
- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగు చేస్తున్న వారిపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు ఆత్రం భగవంత్‌రావు 4వ వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్రం భగవంత్‌రావు అత్యంత వెనుకబడ్డ కొలాం ఆదివాసీ తెగ నుంచి వచ్చి సంఘంలో రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు వరకు అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. ఉట్నూర్ కేంద్రంగా అనేక ఆదివాసుల సమస్యలపై పోరాటలు నిర్వహించి ఆదివాసుల హక్కులకై ఉద్యమించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నేడు టీఏజీఎస్ నాయకత్వం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగు దారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, పోడు భూముల్లో కంధకాలు తవ్వడం ఆపాలని డిమాండ్ చేశారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు దారులపై ఫారెస్ట్ అధికారుల దాడుల విషయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కలుగజేసుకొని ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని కోరారు. నిన్న హైదరాబాద్ ఫారెస్ట్ అధికారుల సమావేశంలో మంత్రి సీతక్క అనర్హులకు పట్టాలు ఇచ్చారన్న వ్యాఖ్యలను ఖండించారు. ఇంకా అనేక మందికి పోడు పట్టాలు రాలేదని, పట్టా ఉన్న భూములను సైతం ఫారెస్ట్ అధికారులు కంధకాలు, మొక్కల నాటడం పేరుతో దాడులు చేస్తున్నారని అన్నారు. పోడు పట్టాలను పంపిణీ చేయాలనే డిమాండ్‌తో భవిష్యత్‌లో రాష్ట్ర వ్యాప్తంగా టీఏజీఎస్ ఉద్యమం నిర్మిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, రాష్ట్ర నాయకులు భీంరావు, జిల్లా నాయకులు మెస్రం మహేష్, కోవ సునీల్, ఈశ్వర్ ఆత్రం కిష్టన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, కార్యదర్శి కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

సాగుకు సమయాత్తం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని పుస్పూర్ గ్రామంలో ఆదివారం రైతులు విత్తనాలు విత్తుతున్న దృశ్యం కనిపించింది. వర్షం కోసం ఎదురు చూసిన రైతులు గత రెండురోజుల నుంచి వర్షం కురవడంతో రైతులు వారి భూముల్లో విత్తనాలు విత్తుకుంటున్నారు. ఎక్కడ చూసిన రైతులు వారి భూముల్లో పనులు చేసుకుంటూ కనిపిస్తున్నారు. మొన్నటి వరకు విత్తనాలు కొనాలా వద్దా అని సందేహంలో ఉన్న రైతులు వర్షం కురవడంతో విత్తనాలు విత్తుకుంటున్నారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా అభిలాష అభినవ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అభిలాష అభినవ్‌కు నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా ఆదివారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్‌ను ఆర్డీఓ, ఇతర జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రిమ్స్‌లో కొత్త కాంట్రాక్టర్లను నియమించాలి

- మంత్రి సీతక్కకు వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో గత కొన్నేండ్లుగా కొనసాగుతున్న కాంట్రాక్టులకు కాకుండా కొత్త కాంట్రాక్టులను నియమించాలని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాసేవా భవన్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రిమ్స్‌లో కాంట్రాక్టర్లు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. గత కొన్నేండ్లుగా కృష్ణ కన్స్ట్రక్షన్, మహాలక్ష్మి మ్యాన్ పవర్ ఏజెన్సీ వారే కొనసాగుతున్నారని అన్నారు. వారు రిమ్స్‌లో ఉద్యోగ నియామకాల్లో ఒక్కొక్కరి నుంచి లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వసూలు చేశారని మంత్రికి తెలిపారు. ఉద్యోగం కావాలని వచ్చిన అమాయక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ ఏజెన్సీల వల్ల కార్మికులు కూడా చెప్పుకోలేని బాధలతో సతమతమవుతున్నారని అన్నారు. ముఖ్యంగా ప్రతి యేటా వీరే లోపాయి కారి ఒప్పందం ద్వారా తమ కాంట్రాక్టులను రెన్యువల్ చేసుకుంటూ వెళుతున్నారని ఇది కరెక్ట్ కాదని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. కొత్త కాంట్రాక్టులను నియమించే క్రమంలో పత్రికా ప్రకటన ద్వారా బహిర్గతంగా కాంట్రాక్టర్లను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా అవకాశం కోసం ఎదురుచూసే అనేక మంది నిరుద్యోగులకు కొత్త కాంట్రాక్టర్ల ద్వారా ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకు వెంటనే రిమ్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న కృష్ణ కన్స్ట్రక్షన్‌తో పాటు మహాలక్ష్మి మ్యాన్ పవర్ ఏజెన్సీ వారిని తొలగించాలని, కిట్స్ టెండర్లు, బ్లడ్ బ్యాంక్ టెండర్, ఆరోగ్యశ్రీ ఇంప్లాంట్స్ టెండర్ కుడా వేయడం లేదని అన్నారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించాలని మంత్రిని కోరడం జరిగిందని తెలిపారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఏపీలో ఉన్న ఉద్యోగులను తెలంగాణకు తీసుకోవాలని విన్నవించగా స్పందించి, ఫైలును పంపించారని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో ఉద్యోగులకు 20వ తేది వరకు వేతనాలు వచ్చేవని, కాంగ్రెస్ హయంలో ప్రతి నెల 5వ తేదిలోపు వేతనాలు వస్తున్నాయన్నారు. పదేండ్లుగా ఏపీలో నాల్గవ తరగతి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారిని తెలంగాణకు తీసుకురావాలని విన్నవించిన వెంటనే సీఎం స్పందించినట్లు తెలిపారు. అదే విధంగా పార్ట్ టైమర్ ఏఎస్ఎం, డెయిలీ వేజ్ వారికి రూ.30 వేల నుంచి స్కూల్‌లు ఫీజు ఇవ్వాలని పీఆర్సీ కమిషనర్‌ను కోరడం జరిగిందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం పని చేస్తుందని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు ఉన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..



నవతెలంగాణ-బోథ్

ప్రతి కార్యకర్తకు అండగా ఉండి, అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చెర సాయి ఫంక్షన్ హాల్‌లోని బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ అభినందన సభకు ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ మాట్లాడుతూ 1994 నుంచి రాజకీయ ప్రస్తావనం మొదలైందని అప్పటి నుంచి ఇప్పటివరకు ఆదిలాబాద్ జిల్లాలోని ఎన్నో పదవులు చేశానని అలాగే చాలా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే మారుమూల పల్లెకు ప్రతి గ్రామ గ్రామాలకు రోడ్డు వేయడం జరిగిందన్నారు. అలాగే ఇప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహయ సహకారాలతో మరింత అభివృద్ధి చేసి నిరూపిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా నా గెలుపుకు కారణం కార్యకర్తలేనని గుర్తు చేశారు. కష్టపడి గెలిపించిన ప్రతి కార్యకర్తలకు అభినందించారు. అనంతరం ఎంపీని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, మండల కన్వీనర్ బోరే రవీందర్, నాయకులు జీవీ రమణ, రాజు, మిట్కారే రాజేశ్వర్, చిటికేసి వెంకటేష్, తుకారాం, రాకేశ్‌రెడ్డి, రోహిత్, జుగాదిరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోథ్

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన సందర్భంగా బోథ్ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పుట్టినరోజు సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు తినిపించారు. అనంతరం ఆయనను పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు భారీ బందోబస్తు ఏర్పాటు

- 6 అంతర్ రాష్ట్ర, 6 అంతర్ జిల్లా చెక్ పోస్టులు
- జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు
- ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన బందోబస్తు నిర్వహించబోయే అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత 20 రోజులుగా ఆరు అంతర్‌రాష్ట్ర, ఆరు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ప్రతి చెక్ పోస్ట్‌లో 5 గురు సిబ్బందిని ఏర్పాటు చేసి, 24 గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్ మూడు ప్రధాన పట్టణాల్లో ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ, అక్రమ రవాణా జరగకుండా కాపాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో, జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ బందోబస్తుల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాలలో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేశారు. ఎటువంటి సమాచారం అందజేయాలన్న డైల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదినం.. అభిమానంతో రక్తదానం..



నవతెలంగాణ-ఉట్నూర్

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్మదినం సందర్భంగా ఆదివారం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రిలో పండ్లను పంపిణీ చేయడంతో పాటు గిరిజన భవనంలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జు పటేల్ యువసేన, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఓ పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన ఈ ప్రాంతానికి భవిష్యత్తులో మరిన్ని సేవలందించాలని, నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెడ్మ బొజ్జు పటేల్ యువసేన సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి...

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ లేఖ విడుదల చేశారు. జన్మదినం సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజా సేవలో నిమగ్నమై, రాష్ట్రంలో ప్రజా పాలనలో భాగస్వామ్యం కావడానికి భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యం ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం పట్ల ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంద్రవెల్లి : ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జన్మదిన వేడుకలను ఆదివారం స్థానికంగా అభిమానులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ముకాడే ఉత్తం ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లను అందజేశారు. మండలంలోని కేస్లాపూర్, ముత్నూరు గ్రామంలో మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

మండుతున్న నిత్యావసరాల ధరలు

- టమాటప కిలో రూ.60

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మండుతున్న కూరగాయల ధరలతో పాటు తామేమీ తక్కువ కామంటూ.. పప్పుల ధరలు సైతం అమాంతంగా పెరిగిపోతున్నాయి. గత రెండు రోజుల కింద కిలో రూ. 40 పలికిన టమాటా ధర ఒకే సారి రూ. 60కి చేరుకుంది. పచ్చి మిర్చి సైతం రూ.100 నుంచి 120 ధర పలుకుతోంది. ఇక వివిధ రకాల పప్పుల ధరలు సైతం వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కంది పప్పు కిలోకు రూ.170 నుంచి 180 వరకు ప్రస్తుతం మార్కెట్‌లో ధరపలుకుతోంది. పెసర పప్పు కిలోకు రూ.120, మినమ పప్పు రూ.110, మసూరి పప్పు రూ.100, ఇలా ఏ నిత్యావసర ధరలు చూసుకున్న ఆకాశాన్నంటుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.25 నుంచి 30 పలికిన ఉల్లిగడ్డ ఒకేసారి కిలో రూ.40కి చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలతో పాటు పప్పుల ధరకు సైతం పెరగడంతో ఏమి తినేటట్టు లేదు..ఏమి కొనేటట్టు లేదు అనే చందంగా మారింది. వర్షాలు సకాలంలో కురువక పోవడంతో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో కిలో కొనేవాళ్లు పావు కిలో సరిపెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాలికపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి అన్నారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్ మిల్‌లో చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై సమగ్రమైన దర్యాప్తు జరిపించి, నిందితున్ని చట్ట ప్రకారంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను పీఓడబ్ల్యూ తీవ్రంగా ఖండిస్తుందని, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మహిళా లోకం ఈ దుర్మార్గమైన ఘటనను ఖండించాలని అన్నారు. ఎన్నో సార్లు ఎన్నో ఘటనలు జరిగినప్పటికీ రైస్‌మిల్ యాజమాన్యం పట్టింపులేకుండా వ్యవహరించడాన్ని లేబర్ డిపార్ట్‌మెంటుపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనేక రకాల డ్రగ్స్ కు యువత బానిసలు కావడానికి కారణం ప్రభుత్వాలు, పోలీస్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, డ్రగ్స్‌ను నిషేధించాలని, యువత ఇలాంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. సమాజానికి, ప్రజలకు ఆటంకాలు కలిగించే విధంగా వ్యవహరించడం సమాజానికి మంచిదికాదని, హాని కలుగజేస్తుందని అన్నారు. అత్యాచారానికి, హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వలస కూలీలకు అన్ని విధాలుగా సౌకర్యాలు, పనికి తగిన కూలీ రేట్లు చెల్లించేలా కార్మికశాఖ, ప్రభుత్వం తగిన విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పేర్క గంగమ్మ, వర్ష తార, సునీత పాల్గొన్నారు.

గంగన్న కుటుంబానికి అండగా ఉంటాం..

- మాజీ ఎంపీ రమేష్ రాథోడ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రానికి చెందిన ఐకేపీ ఏపీఎం లింగంపల్లి గంగన్న ఇటీవల గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి మనోధైర్యాన్నిచ్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. దేవుడు ఆతని ఆత్మకు శాంతి నివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీటీసీ అర్క పుష్పలత, మండల అధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, స్థానిక నాయకులు ఉన్నారు.



ఎస్పీని ప్రశంసించిన కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికలను ఆదిలాబాద్ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి చిన్న అవాంఛనీయ సంఘటన జరగకుండా నిర్వహించడానికి ఎంతగానో కృషి చేసిన జిల్లా పోలీసు వ్యవస్థ ఉన్నతాధికారి జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ద్వారా ప్రశంసా పత్రం అందజేసింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం, సిబ్బంది ఎన్నికల విధులను నిర్వర్తించేలా ప్రణాళికలు చేయడం, ప్రజలలో ఓటింగ్‌పై అవగాహనలు కల్పించి, ఫ్లాగ్ మార్చలు నిర్వహిస్తూ, ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడం. అదేవిధంగా ఎన్నికల సామాగ్రి, ఈవీఎంల భద్రత తదితర అంశాలపై ఉన్నతమైన పనితనాన్ని అభినందిస్తూ, ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ జిల్లా ఎస్పీకి శాలువాతో సత్కరించి, సిబ్బందితో కలిసి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేసిన జిల్లా పోలీసులందరికీ ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రశంసలు ఉన్నతమైన పనితనాన్ని సాధించడానికి తోడ్పాటను అందజేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ సీసీ దుర్గం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది సైబర్ సెల్ హెడ్ కానిస్టేబుల్ సంజీవ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది విజయ్, మాజీద్ పాల్గొన్నారు.

మోహన్ హత్య ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టాలి



నవతెలంగాణ-ఉట్నూర్

పాత ఉట్నూర్‌కు చెందిన మోహన్‌ను హత్య చేసిన నిందితులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లంబాడా జేఏసీ ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు సానుకూలంగా స్పందించి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డీఎస్పీని కలిసిన వారిలో లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిలు బానోత్ రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆడే సురేష్, నేతావత్ రాందాస్ నాయక్, గణపతి, తరుణ్ ఉన్నారు.

ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలని గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు జాదవ్ సుమేష, పెందోర్ దీపకలు అన్నారు. పట్టణంలోని గిరిజన భవనంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక ట్రైబల్ అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నెంబర్ మూడును యదావిధిగా కొనసాగించాలని, ఏజెన్సీలో 1/59, 1/70, పిసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. ఐటీడీఏలో ఉన్న బ్యక్‌లాగ్ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. 317 జీఓను పరిగణలోకి తీసుకోకుండా ఏజన్సీ ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. భార్య భర్తలకు దగ్గరగా ఉండే విధంగా చూసుకోవాలి సూచించారు. జీఓ నెంబర్ 3ప్రకారమే ఉద్యోగులు, బదిలీలు ప్రమోషన్ల చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జాదవ్ చంద్రకాంత్, రామారావు, రాందాస్, మోతీరాం, ప్రకాష్, రమేష్, రాజు, రవీందర్, వంశీ, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రార్ధనలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రార్ధనలు ఈద్గాలో కాకుండా ఆయా మసీదుల్లోనే ఆచరించేలా మసీదు కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. కాగా మున్సిపల్ ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో పరిశుభ్ర కార్యక్రమాలు కొనసాగగా ఈద్గా కమిటీల ఆధ్వర్యంలో ఇతర పనులు చేశారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 7:30 నిమిషాలకు ఈద్గాలో నమాజ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒక వేళ వర్షం కురిస్తే ఆయా మసీదుల్లోనే నమాజ్‌లను ఆచరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జూన్ 17, 2024 | www.navatelangana.com

బాధితులను పరామర్శించిన కోనప్ప

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని అగర్‌గూడా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పూజారి వెంకన్న తండ్రి పూజారి బాపు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాదిత కుటుంబాన్ని పరామర్శించారు. పూజారి బాపు చిత్రపటానికి నివాళులర్పించి సానుభూతి తెలియజేశారు. అపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా కొనప్ప అన్నారు. అనంతరం కుటుంబానికి రూ.50000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-బెజ్జూర్



ద్విచక్ర వాహనం అదపుతప్పిన ఘటనలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని పోతపల్లి బారెగూడ గ్రామ సమీపంలో జరిగింది. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం చింతలమానపల్లి మండలం కర్జల్లి గ్రామానికి చెందిన భూస రామక్క(59) తన మనవడు మహేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బెజ్జూర్ మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలోని తన కూతురి ఇంటికి వస్తున్న క్రమంలో బారెగూడ పోతపెల్లి గ్రామ సమీపం మధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. దీంతో రామక్కకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బక్రీద్ పండుగకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

- ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే బక్రీద్ పండుగకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరు మతసామరస్యాన్ని కాపాడుకుంటూ పండుగ నిర్వహించుకోవాలన్నారు. 20 రోజులుగా జిల్లా వ్యాప్తంగా 6 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పండగకు సంబంధించి అనవసరమైన వధంతులు ఏవైనా సామాజిక మాధ్యమాల్లో వస్తే వాటిని నమ్మకూడదని సూచించారు. ఎవరైనా అటువంటి పోస్టులను సామాజిక మాధ్యమాల్లో పెట్టితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటివి ప్రచారం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలోని ప్రజలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

చిత్రకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

- రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చిత్రకారులకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చిత్రకారులు అందరినీ ప్రభుత్వం గుర్తించి వారిని అన్ని విధాల ఆదుకుంటూ చిత్రకారుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఇదే వృత్తిగా భావించి చిత్రకళ మీదే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న చిత్రకారులు ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురవుతూ పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా ఆర్టిస్టులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సంఘం అధ్యక్షులు రమణ, శంకర్, సత్యకళ సత్యనారాయణ, కె.సత్యనారాయణ, రాజ్‌నాథ్, యాదగిరి, మల్లేశం, ఆసిఫాబాద్ జిల్లా ఆర్టిస్టులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-కౌటాల

ప్రతి సోమవారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారులకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని ఏఈ రవిందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ప్రతి సోమవారం కౌటాల సబ్ డివిజన్ కార్యాలయంలో సిర్పూర్-టి, కౌటాల, బెజ్జూర్ సెక్షన్ కార్యాలయాలలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి ఉంటుందని తెలిపారు. సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి మండల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసుకుంటూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ మండల విద్యుత్ వినియోగాదారుల సమస్యలు పరిష్కరించడానికి నేటి నుండి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్టు పట్టణ ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఆసిఫాబాద్ సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 నుండి 1 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి ఉంటుందన్నారు. విద్యుత్ సమస్యలున్న ఆసిఫాబాద్ మండల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేంజ్ అధికారిపై ఫిర్యాదు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎల్లూర్ గ్రామానికి చెందిన అప్పాజీ శ్రీనివాస్ ఫారెస్ట్ రేంజ్ అధికారిపై ఆదివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల పెంచికల్‌పేట్ అటవీ ప్రాంతంలో ఓ ఎలుగు బంటి చనిపోయిన విషయంలో అటవీ రేంజ్ అధికారి విచారణ పేరుతో తనను తీవ్రంగా కొట్టారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం ఎస్సై కొమరయ్యను వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయమై రేంజ్ అధికారి సుధాకర్ సంప్రదించగా దాడి చెయ్యలేదని తెలిపారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని నంబాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో 2008-09 పదవ తరగతి చదివిన విద్యార్థులు 17 సంవత్సరాల తరువాత ఒక చోట కలిశారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ సెల్ఫీలు దిగుతూ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఉపాధ్యాయులు సోమశేఖర్, రాజశేఖర్, రమణ, రాజన్న, రాజేష్, రజిత, రాజేశ్వరి, వెంకట్ పాల్గొన్నారు.

బడిబాట పట్టేనా..?

- సౌకర్యాలున్నా పెరగని విద్యార్థుల సంఖ్య
- ఇంటింటికి తిరుగుతున్న ఉపాధ్యాయులు
- 49 పాఠశాలల్లో 150 మంది నమోదు



బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కౌటాల

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు ఊరూరా ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. పాఠశాలలోని మౌలిక వసతులు వివరిస్తూ ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రయత్నిస్తున్నారు. ఒక వైపు మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. అదే విధంగా అమ్మఆదర్శ పాఠశాలల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయిన ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులు చేజారిపోకుండా ఇప్పటికే ఒక దఫా ఊరూరా ప్రచారం పూర్తి చేశారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతున్నారు. తమలోని నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన, వసతులు కల్పిస్తున్నామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఉపాధ్యాయులు స్థానికంగా లేకపోవడంతో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇదే సాకుగా చూపి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు అడ్మిషన్లను కొల్లగొడుతున్నారు.

నమ్మకం లేకనేనా..?


ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు స్థానికంగా లేకపోవడం విద్యార్థుల నమోదు తక్కువకు ఒక కారణం అయితే.. మీ పిల్లలు ప్రయివేట్‌కు మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలకా అనే ప్రశ్నలు కూడా తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. ఇలాంటి అనుభుతులు నడుమ ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందా అనే సందేహాలు కూడా వస్తున్నాయి. ఈ క్రమంలో ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న ఫలితం లేకుండా పోతుందని తెలుస్తోంది. దీనికి తోడు బదిలీల ప్రక్రియ మొదలు కావడంతో మధ్యలో బడిబాట కార్యక్రమం పడకేసిందని చెప్పావచ్చు. తిరిగి బడి బాట కార్యక్రమం చేపట్టినప్పటికీ అది అంతంతా మాత్రమే కోనసాగింది.

49 పాఠశాలల్లో దాదాపు 150 నమోదు

మండలంలో 49 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 5, ప్రాథమికోన్నత పాఠశాలలు 7, ఐటీడీఏ పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 33 ఉన్నాయి. గత సంవత్సరం వీటి పరిధిలో బడిబాట విజయవంతం అయింది. కానీ ఇప్పటి వరకు మండలంలో కేవలం 150లోపే విద్యార్థుల అడ్మిషన్లు జరిగినట్టు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఈనెల మూడు నుంచి ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఈనెల 19 వరకు కొనసాగుతోంది. మిగిలిన రెండు రోజుల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కష్టపడాల్సి వస్తుంది.

బడిబాటను విజయవంతం చేస్తాం

డి.సోమయ్య, మండల విద్యాశాఖ అధికారి



మండలంలో బాడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించాం. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్య గురించి తెలియజేస్తున్నారు. ఈ నెల 19న బాడిబాట కార్యక్రమం ముగించుకొని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేస్తాం.

భూ వివాదంపై డిఎస్పీ విచారణ

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని మర్తిడి శివారులో గల 167/2 ,167/3, 167/4, 167/5 నెంబర్లలో గల 34 ఎకరాల భూమికి సంబంధించిన దానిపై ఆదివారం ఏఎస్పీ కరుణాకర్ విచారణ చేపట్టారు. భూమి తమది కాగజ్‌నగర్‌కు చెందిన గజ్జల సురేష్ తెలుపుతుండగా తామే కాస్తు చేస్తున్నామని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ధరణి పాస్ బుక్ తమ వద్దనే ఉందని భిక్షపతి గౌడ్ తాము భూమిలో విత్తనాలు విత్తుతున్న సమయంలో అక్రమంగా భూమిలో దున్నుడని విచారణలో డీఎస్పీకి సురేష్ తెలిపారు. భిక్షపతి గౌడ్ మరికొందరిని తీసుకొని వివాదం చేస్తున్నారని ఆయన డిఎస్పీ వివరించారు. భూమికి సంబంధించిన పూర్తి వివరాలను డీఎస్పీ సేకరించి తహసీల్దార్‌తో భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించినంతరం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



విచారణ చేపడుతున్న డిఎస్పీ, పోలీసులు

రాళ్లదాడిలో ఐదుగురికి గాయాలు

మండలంలోని అంబాగట్టు, బూరు గూడ గ్రామాల్లో గల 71 సర్వేనెంబర్ భూమి వివాదంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రం తెలిపారు. అంబగట్టు శివారులోని సర్వేనెంబర్ 71లో 13 ఎకరాల భూమిపై భుర్గుగూడెం గ్రామానికి చెందిన తలండి గణేష్ చేనులోకి మాదే చేను అంటూ పార్తేటి జగదీష్ వర్గీయులు ఆదివారం వెళ్లగా ఇరుగ్రూపుల మధ్య రాళ్ల గొడవ జరిగింది. భూ గొడవలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ రాళ్లదాడిలో తలండు గణేష్, మల్లేష్, విమల, సరోజనతో పాటు నానాజీకి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించినట్టు ఎస్సై తెలిపారు. ఇరువురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విక్రం తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్లీంల రెండవ అతిపెద్ద పండుగ
- నేడు ఈదుల్ అదా



ముస్లీంలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి(ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ముస్లీం తన జీవితంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని అది కూడా తన సొంత డబ్బులతో చేయాలనే వారి విశ్వాసానికి మూలం బక్రీద్. త్యాగానికి ప్రతీకగా నిలిచే పండగతో పాటు ముస్లీంలకు రంజాన్ తర్వాత అతిపెద్ద రెండవ పండగగా నిలిచే బక్రీద్ వేడుకలకు నేడు జిల్లా వ్యాప్తంగా నిర్వహించుకోవడానికి ముస్లీంలు సర్వం సిద్ధం చేసుకున్నారు.

ఇది బక్రీద్ చరిత్ర

బక్రీద్ అంటే బకర్ ఈద్. అంటే మూగజీవిని దేవునికి అర్పించడం. ఈ సమయంలో తమకు ఇష్టమైన వాటిని దేవునికి త్యాగం చేయాలని చెప్పగా ప్రవక్త అబ్రహం తన కుమారున్ని బలి ఇవ్వడానికి సిద్ధం కాగా అల్లాహ్ ఆయన త్యాగనిరతకి మెచ్చి మూగజీవాన్ని బలి ఇవ్వాలని సూచిస్తాడు. అలా బలి ఇచ్చిన మూగజీవాలను మూడు భాగాలుగా చేసి అందులో ఓ వంతు పేద ప్రజలకు, రెండో వంతు తమ చుట్టాలకు, మూడో వంతు భాగాన్ని తమ కుటుంబం కోసం వాడుకుంటారు. అందుకే బక్రీద్ పండుగ రోజున ముస్లిలందరూ ఖుర్బానీ ఇస్తారు.

ముస్లీంలకు రెండవ అతి పెద్ద పండుగ

ప్రపంచ వ్యాప్తంగా ఉండే ముస్లీంలకు రంజాన్ తర్వాత అతి పెద్ద పండుగ బక్రీదే. రంజాన్ మాసం ముగిసిన 70 రోజులకు ఈదుల్ అదా పండుగ వస్తుంది. ముస్లీంలు అత్యంత పవిత్రమైన యాత్రగా భావించే హజ్ యాత్ర కూడా ఇదే సమయంలో ప్రారంభమవుతుంది.

నేడే బక్రీద్ వేడుకలు

నేడు జిల్లా వ్యాప్తంగా బక్రీద్ పండుగ వేడుకలు నిర్వహించుకోవడానికి మైనార్టీ సోదరులు సన్నద్ధమయ్యారు. జిల్లాలోని అన్ని మసీదులలో ఇమాంల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం, అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడం కనిపిస్తోంది. ఇప్పటికే పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా గతంలోని సాంప్రదాయాలను యధావిధిగా కొనసాగించి, సోదర భావంతో పండుగ వేడుకలు నిర్వహించుకోవడానికి అన్ని వర్గాలు సిద్ధమయ్యాయి.



న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

- అరే సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ



నవతెలంగాణ-దహెగాం

అభం శుభం తెలియని ఆరేండ్ల పాపపై జరిగిన అఘాయిత్యం యావత్తు దేశాన్ని కుదు పేసిందని బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని ఆరేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శెట్ పెల్లి శివాజీ అన్నారు.ఆదివారం మండల కేంద్రం లోని బాధిత కుటుంబాన్ని ఆరేకుల బంధావులతో కలిసి పరామర్శించారు. చిన్నారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాధిత కుటుంబానికి చాలా తక్కువ మొత్తంలో హామీ ఇచ్చారని అలా కుదరదని అన్నారు. పది లక్షల ఎక్స్గ్రేసియా 5 ఎకరాల భూమి జూనియర్ అసిస్టెంట్ గా ప్రభుత్వ ఉద్యోగం తో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర కుల సంఘం అంత అన్నివేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెంకన్న తాలూకా అధ్యక్షుడు సత్యనారాయణ మండల అధ్యక్షుడు నారాయణ తో పాటు రాష్ట్ర జిల్లా మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

అక్రమంగా తరలిస్తున్న ఆవుల లారీ పట్టివేత



నవతెలంగాణ-బెజ్జూర్

అక్రమంగా అవులను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు ఆదివారం మండలంలోని కుంటల మానేపల్లి గ్రామ సమీపంలో లారీలో అక్రమంగా తరలిస్తున్నారు. లారీని తనిఖీ చేయగా అందులో 36 ఆవులున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తుంగా పట్టుకున్నామని ఎస్సై విక్రమ్ తెలిపారు. లారీని స్వాధీనం చేసుకొని ఆవులను గోశాలకు తరలించారు.

బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించాలని ఎస్సై సాగర్ తెలిపారు. శాంతియుతంగా అందరు కలిసి మెలిసి పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుంది. అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను పరిష్కరానికి తన వంతు సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేందర్ శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ, పట్టణ అధ్యక్షుడు దారవేణి రాము పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బక్రీద్ పండుగ సందర్భంగా ఈనెల 17న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని సూచించారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ బక్రీద్ అని సంతోషంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

సాంప్రదాయాలలో బ్రాహ్మణుల పాత్ర ఎంతో కీలకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు బలంగా ఉండటంలో బ్రాహ్మణుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని తీర్పెల్లి రామాలయంలో బ్రాహ్మణ్ సమాజ్ ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమంతో పాటు ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన బ్రాహ్మణ్ సమాజ్ కొత్త కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా నూతన కార్యవర్గసభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గం ఎంపీ, ఎమ్మెల్యేలను పూలమాల, పుష్పగుచ్ఛంతో ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ్ సమాజ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోషాధికారులు అన్నోజుల సంతోష్, నర్మల్కర్ విశ్వాస్, అభిలాష్ టెంబేకర్‌లతో పాటు సమాజ్ సీనియర్లు, ప్రముఖులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జన్మదినం

నవతెలంగాణ-జన్నారం



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు జన్మదిన వేడుకలను జన్నారం మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేసి ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లను బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముసాఫర్ అలీ ఖాన్ మేకల మాణిక్యం, కార్యదర్శి సయ్యద్ ఫసియుల్లా, పట్టణ అధ్యక్షుడు దుమాల రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు బీనవేణి రాజన్న, ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌కు పర్యాటకుల తాకిడి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ఆదివారం ఉదయం ఐపీఎస్ అధికారి సుధీర్వెజి తన కుటుంబ సభ్యులతో కలిసి సఫారీలో అడవి ప్రాంతంలో పర్యటించారు. అడవిలో జంతువులు పక్షులను చూసి ఆనందం వ్యక్తపరిచారు. టైగర్ జోన్ ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శని, ఆదివారాల్లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్నందున పర్యాటకులకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణమంటున్న కుటుంబసభ్యులు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హమాలివాడలో నివాసం ఉంటున్న జంజిరాల స్నేహశీల(36) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ప్రయివేటు పాఠశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తోంది. భర్త మహేష్, తల్లి, తండ్రి ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శనివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగిన అనంతరం రాత్రి 9 గంటల ప్రాంతంలో గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు భర్త మహేష్ వేధింపులే కారణమంటూ ఆరోపించారు. 2009లో మహేష్ స్నేహశీలకు ప్రేమ వివాహం జరిగింది. వీరికి మనస్వి (13), సమాఖ్య(10) ఇద్దరు పిల్లలు ఉన్నరన్నారు. మహేష్ తాగుడుకు, జూదానికి, పబ్జీకి బానిసై అదనపు కట్నం కోసం వేదించేవాడు. అక్రమ సంబంధం అంట కడుతూ వేధించేవాడని, ఇష్టం వచ్చినట్లు తన మీద దాడి చేస్తూ గత రెండు సంవత్సరాల నుంచి వేధించేవాడని పేర్కొన్నారు. లక్సెట్టిపేట కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో ప్రయివేట్ పాఠశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తోంది. రెండు రోజుల్లో వారి పెద్ద కూతురు శారీ ఫంక్షన్ ఉండగా శనివారం రాత్రి గొడవ జరగడంతో అఘాయిత్యానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు మంచిర్యాల పట్టణ ఎస్ఐ మహేందర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం నాయకులు కేర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఇల్లందు క్లబ్‌లో అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు గుండె వ్యాధి సంబంధిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్ హైదరాబాద్ గుండె వ్యాధి నిపుణులు డా.ప్రియా కాంతిలాల్ షా, డా కిరణ్ బాబు సమక్షంలో ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి ప్రారంభించి ఇలాంటి మెడికల్ క్యాంపులో ముందు ముందు కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. సింగరేణికి ఉత్పత్తి ఎంత ముఖ్యమో అలాగే అధికారులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం అని తెలిపారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి కావలసిన పాటించాల్సిన సూత్రాలు పాటిస్తూ మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. ముఖ్యంగా అధికారులందరూ వారి వృత్తి నిర్వహణలో ఎక్కువగా ఒత్తిడికి గురి కాకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం పురుషోత్తం రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు కే వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, కోశాధికారి బానోతు రాము పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న రేచిని హైస్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని రేచిని గ్రామానికి చెందిన వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సహకారంతో జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను అందుకున్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో సైతం పాల్గొని సత్తా చాటారు. 2023-24లో ఆసిఫాబాద్ జరిగిన రాష్ట్ర పోటీల్లో చెందిన హర్షిత వెంకటేశ్‌లు గోల్డ్ మెడల్ సాధించారు. 2022 సంవత్సరం సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో అండర్-12 లాంగ్ జంప్‌లో కళ్యాణి పతకాన్ని కైవసం చేసుకుంది. 2022 సంవత్సరంలో హైదరాబాదులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14 హండ్ బాల్ టోర్నమెంట్లు రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. 2022వ సంవత్సరం మందమర్రిలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ అండర్-17లో పాల్గొని సత్తా చాటారు. పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఆట స్థలం కేటాయిస్తే భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తామని విద్యార్థులు తెలిపారు

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం



పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో నేతకాని సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ గవర్నమెంట్ ప్లీడర్ రాజేష్ నేత, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు వెంకటేష్ నేత అని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతకాని సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, రాష్ట్ర నాయకులు జాడి గంగాధర్, జనుగూరు మల్లయ్య, వినోద్, వర్లకుంట శంకర్, బోర్లకుంట ప్రభుదాస్, సత్యం, శెట్టిపల్లి గంగయ్య, శశాంక్ పాల్గొన్నారు.

18న ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-తాండూర్

ఆదివాసి గిరిజన సంఘం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూన్ 18న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పెగడపల్లి గ్రామంలో సమావేశం ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రాజారాం మాట్లాడుతూ పోడు రైతులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యాలు రోజురోజుకు పెరుగుతున్నయన్నారు. మైనింగ్ పేరుతో వేలాది ఎకరాలు సింగరేణి యాజమాన్యానికి కట్టబెడుతున్న ప్రభుత్వం పోడు రైతులపై దౌర్జన్యాలు కొనసాగిస్తుందన్నారు. పోడు రైతులకు న్యాయం జరగాలంటే రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పోరాటాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ



తాండూర్‌లో..



జన్నారంలో..

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ పాల్గొన్నారు.

జన్నారం : జూన్ 18న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు కనికారం అశోక్ కొండగుర్ల లింగన్న అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలు అరికట్టాలన్నారు. మేదరులకు బొంగుపై హక్కు కల్పించాలన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలన్నారు. ఉన్న భూములను ట్రాక్టర్లతో దున్నుకొనివ్వాలన్నారు. ఈ ధర్నాకు పోడు సాగుదారులు అందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గిరిజన సంఘం నాయకుడు ఆత్రం రాజు, మగ్గిడి జయ, లక్ష్మణ్, దుర్గయ్య, గంగన్న, సుధాకర్ పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్
- గ్రామీణ యువకులకు క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముత్యంపల్లి, దుబ్బగూడెం గ్రామాల పరిధిలో యువకులకు, దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గట్రావ్ పల్లి, సోనాపూర్, లక్ష్మీ పూర్ గ్రామ క్రీడాకారులకు పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఏసీపీ, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డిలు కలిసి క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వేర్వేరుగా మాట్లాడుతూ క్రీడలు ఆడడంతో శరీరానికి వ్యాయామం అవుతుందని, విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉదయం వ్యాయామం చేయాలి, ఆరోగ్యం కాపాడుకోవాలని అన్నారు. యువకులు, గంజాయి, జూదం వంటి చెడు అలవాట్లకు, ఇతర చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. మీ గ్రామాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని, అసాంఘిక శక్తుల



గురించి ఎటువంటి సమాచారమైనా పోలీసులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



తాండూర్‌లో..

తాండూర్ : తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిష్టంపేట్ అంకుశం గ్రామాల యువకులకు తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఆదివారం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటే శరీరానికి వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. యువకులు సెల్ ఫోన్లలో కాలాన్ని వృధా చేయకుండా తమ విలువైన సమయాన్ని జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు వినియోగించుకోవాలన్నారు. యువత పలు రంగాల్లో రాణించాలంటే సంపూర్ణ ఆరోగ్యం, శారీరక దారుఢ్యం సమాజం పట్ల అవగాహన అవసరం అన్నారు. యువకులు, గంజాయి, జూదం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్న ఊరు కన్న తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాఠశాల కోసం ఏకమైన గ్రామస్తులు

నవతెలంగాణ-కాసిపేట

ప్రభుత్వ పాఠశాలలో అవసరమయ్యే సదుపాయాలు, సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించి అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ పేర్కొన్నారు. ఆదివారం బెల్లంపల్లి మండలం సోమగూడెం చొప్పరిపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గ్రామస్తుల ఐక్య సమావేశం ఏర్పాటు చేసి ఒక తాటి మీదికి వచ్చి చొప్పరపల్లి పాఠశాలను కాపాడుకునేందుకు, పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఐక్యంగా నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాల మూసి వేసే దశకు చేరుకోవడంతో పాఠశాలను కాపాడుకునేందుకు పునః ప్రారంభం కోసం ఐక్యంగా సమావేశం ఏర్పాటు చేసి ఒక తాటి మీదకు వచ్చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ మాట్లాడుతూ చొప్పరపల్లి పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటికే పాఠశాలలో నూతన బోర్ ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక నిధుల ద్వారా పాఠశాల



పనులు చేపట్టి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. గ్రామ పిల్లలందరినీ కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. చొప్పరపల్లి పాఠశాలకు ఒక ఉపాధ్యాయురాలిని కేటాయించగా మొదటి రోజు 15 మంది విద్యార్థులు చేరినట్లు, విద్యార్థుల సంఖ్యను పెంచి అందరూ ఇదే పాఠశాలలో చేరే విధంగా గ్రామస్తులంతా ఐక్యంగా నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించే విధంగా విద్యాధికారులతో మాట్లాడి పోస్టులను మంజూరు చేయించనునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తె భూమయ్య, ఎంపీటీసీ చుంచు మల్లమ్మ, మాజీ సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలా గౌడ్, జైన శ్రీనివాస్, గోమాస భీమయ్య దుర్గం గోపాల్, బూట్ల వెంకటలక్ష్మీ, దూడం మహేష్, కుక్క రాంచందర్, చిప్పకుర్తి తిరుపతి, గురుమూర్తి, భూమలింగం, సురేశ్, రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాదర్స్ డే సందర్భంగా చేయూత

నవతెలంగాణ-జైపూర్

ఫాదర్స్ డే సందర్భంగా ఏదైనా ఒక మంచి పని చేయాలనే ఉద్దేశంతో నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టాల నాగరాజు మతిస్థిమితం లేని వ్యక్తికి చేయూతనందించారు. జాతీయ రహదారి నెంబర్-63లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తికి క్షవరం చేయించి శుభ్రంగా స్నానం చేయించి కొత్త బట్టలు వేసి కడుపునిండా అన్నం పెట్టాడు. జైపూర్ రసూల్‌పల్లి మధ్య మతిస్థిమితం లేకుండా ఇరువురు వ్యక్తులు తిరుగుతున్నట్లు ముందుగానే గుర్తించిన ఆయన ఇరువురికి కొత్త బట్టలు వేయించాలనుకున్నాడు. తన మిత్రులతో కలిసి మతిస్థిమితం లేని వ్యక్తికి తమ వంతు సేవ



చేసుకోగలిగామని నాగరాజు తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఐఎఎస్ అధికారుల బదిలీలలో భాగంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను జిల్లాలో అర్హత గల ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికార యంత్రాంగంతో కలిసి పని చేస్తానని అన్నారు. నూతన కలెక్టర్‌గా వచ్చిన కుమార్ దీపక్‌కు జిల్లా అదనపు కలెక్టర్‌లు బి రాహుల్, సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి వి రాములు, కలెక్టరేట్ ఏఓ పిన్న రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ స్వాగతం పలికారు.

కలెక్టర్‌ను కలిసి సింగరేణి జీఎం

బదిలీపై జిల్లాకు వచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ



నవతెలంగాణ-తాండూర్

తాళ్ళగురజాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామంలో యువకులకు పోలీసు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అఫ్జలొద్దిన్ క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువైన యువత పెడదారి పట్టకుండా వారిని సన్మార్గంలో నడిపించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రజ్ఞావంతులైన గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రీడలు ఆడడంతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్ళగురజాల ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ క్రియాశీల సభ్యుడు ఎల్ దేవాజి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష చెక్కును మృతునికుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొట్టే శంకర్, సభ్యులు రాసపల్లి రవి, మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎంఈఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పి

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ముదిగుంట గ్రామపంచాయతీ శివారు అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన చుక్కల దుప్పిని గ్రామస్తులు పట్టుకున్నారు. చుక్కల దుప్పిని కుక్కలు తరుముతూ ఉండటం గమనించిన గ్రామస్తులు పట్టుకొని అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన ప్లాంటేషన్ మేనేజర్ గాయపడిన దుప్పిని మండల కేంద్రంలోని పశు వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ సిబ్బందితో కలిసి జైపూర్ రక్షిత అటవీ ప్రాంతంలో సురక్షితంగా దుప్పి పిల్లని వదిలారు. గ్రామంలోకి వచ్చిన దుప్పి పిల్లని కుక్కల బారి నుంచి కాపాడిన గ్రామస్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్‌తో పాటు సెక్షన్ ఆఫీసర్ రేవతి, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన ఉపారపు సాయిలు (55) చింతగూడ లక్ష్మీదేవి ఆలయం నుంచి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా వాహనం అదుపుతప్పి రాయికి ఢీకొట్టడంతో అతని తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఘటన జరిగిన వివరాలు అడిగి తెలుసుకుని భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.